విలేకరులు కావలెను
చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక
ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999

చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక

## నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత
- భానుడి భగభగలతోఇంటికే పరిమితం అయిన జనం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ




**హైదరాబాద్,ఏప్రిల్16 (చట్టం న్యూస్):** ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి

మిగతా 2వ పేజీలో..

సంపుటి : 14 ● సంచిక : 94 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi శుక్రవారం 17 ఏప్రిల్ 2026 ● పేజీలు : 8 ● వెల 2/-

# మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



**కర్నూలు,ఏప్రిల్16 (చట్టం న్యూస్):** కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంపై ఏపీ మంత్రులు భరత్, జనార్ధన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

**కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులు**

**బాధితులను పరామర్శించిన కలెక్టర్ సిరి**

కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద

మిగతా 2వ పేజీలో..

## దేశాన్ని నిర్మించే దిశగా 'శక్తి' స్ఫూర్తితో సాగాలి

### మహిళా బిల్లు నేపథ్యంలో పవన్ కళ్యాణ్ పోస్ట్



**అమరావతి,ఏప్రిల్16(చట్టం న్యూస్) :** భారతదేశం ఈరోజు నారీ శక్తిని గౌరవిస్తూ దేశంలోని మహిళలు వివిధ రంగాల్లో సాధిస్తున్న అసాధారణ విజయాలను వేడుక చేసుకుంటోందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పవన్ ఎక్స్ వేదికగా స్పందించారు. చెస్ బోర్డు నుంచి ఒలింపిక్ పోడియం వరకు భారతీయ మహిళలు

మిగతా 2వ పేజీలో..

## బోట్లు తయారీ కంపెనీని తరిమేస్తారా

- పెట్టుబడులు వస్తే తట్టుకోరా జగన్ గారూ
- ఇదేం రాక్షస మనస్తత్వమో
- లోకేశ్ ఆగ్రహం



**అమరావతి,ఏప్రిల్16 (చట్టం న్యూస్):** దేశ రక్షణకు అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సింది పోయి.. తరిమేస్తానని జగన్ అనడమేంటని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఇదేం రాక్షస మనస్తత్వమని అన్నారు. మత్స్యకారుల పిల్లలకు ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి, అడ్డుకుంటాననడం ముమ్మాటికీ సైకోయిజమేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తల్లిని తరిమేసి, చెల్లిని గెంటేసిన జగన్‌కు దైవం అంటే భక్తి లేదు.దేశం అంటే ద్వేషం. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు వస్తున్నాయంటే దోపిడీ అని గగ్గోలు పెడుతున్నారు. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసం నిండి ఉన్నాయి. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేసి, కంపెనీలన్నీ వెళ్లగొడతామంటున్నారు. జగన్ మోహన్‌రెడ్డి సర్.. ఇవేం రాక్షస చేష్టలు అని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు వస్తాయంటే ఉసూరుమంటూ ఏడుస్తారని వ్యంగ్యంగా అన్నారు. రప్పా.. రప్పా నరుకుతాం.. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ

మిగతా 2వ పేజీలో..

## మంత్రాలయం ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

### మృతుల కుటుంబాలకు 2లక్షల పరిహారం ప్రకటన

**న్యూఢిల్లీ,ఏప్రిల్16 (చట్టం న్యూస్):** కర్నూలు జిల్లాలోని మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతితి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలతోపాటు క్షతగాత్రులకు ఆయన నష్ట పరిహారాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు చొప్పున నష్టపరిహారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఈ నష్ట పరిహారాన్ని అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. మంత్రాలయంలో కొలువుదీరిన

మిగతా 2వ పేజీలో..



# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు
- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు
- వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
- చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
- ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
- ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
- దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు
- ఉత్తరాది, దక్షిణ్యాది అంటూ విభజన తేవద్దు
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
- మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం



**న్యూఢిల్లీ,ఏప్రిల్16 (చట్టం న్యూస్):** మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు. మహిళా రిజర్వేషన్ పక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రాకి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే

మిగతా 2వ పేజీలో..

## చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టిన కేంద్రం

- లోక్‌సభలో మహిళాబిల్లు, డీలిమిటేషన్ బిల్లులు
- డివిజన్ కోరిన విపక్ష సభ్యులు..స్పీకర్ అంగీకరాం
- సభ ఆమోదంతో బిల్లులు ప్రవేశ పెట్టిన కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ,ఏప్రిల్16 (చట్టం న్యూస్):** దేశంలో చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టేందుకు గురువారం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత.. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హోంమంత్రి అమిత్ షా వీటిని ప్రతిపాదించారు. అనంతరం వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. ఈ బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్‌కు పట్టుబట్టాయి. అందుకు స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు. డివిజన్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251 ఓట్లు పోలయ్యాయి. 185 మంది దీనికి వ్యతిరేకంగా ఓటేశారు. మెజార్టీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కేంద్రం ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. ఈ బిల్లులపై

మిగతా 2వ పేజీలో..

## రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా కుట్ర

### జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి జనార్ధన్ రెడ్డి




**అమరావతి,ఏప్రిల్16 (చట్టం న్యూస్):** ప్రతిపక్ష నాయకుడు రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేస్తాడా అంటూ వైఎస్ జగన్‌పై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. పరిశ్రమలు రాష్ట్రానికి రాకుండా చేయాలనే ఉద్దేశంతో జువ్వలదిన్నె వద్దకు వెళ్లి అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి వచ్చిన వారిని లేపేస్తాం, పంపేస్తా, చంపేస్తా' అంటూ జగన్ బెదిరింపులకు దిగుతున్నారని మంత్రి ఆరోపించారు. లూలు వంటి పెద్ద కంపెనీలు కూడా జగన్ దెబ్బకు భయపడి వెనక్కి వెళ్లిపోయాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే జగన్ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. జువ్వలదిన్నె ప్రాజెక్టును తన పాలనలో ఎందుకు అమలు చేయలేదని మంత్రి ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని, అయినప్పటికీ ప్రతి నెలా ఏదో ఒక కార్యక్రమం పెట్టి జగన్ భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజావేదికను కూల్చివేశాడని, పూర్తి కాకముందే

మిగతా 2వ పేజీలో..

## 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

- కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ అభ్యంతరం
- కులగణన లేకుండా చేపట్టడంలో తొందరెందుకున్న అఖిలేశ్
- విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్ షా



**న్యూఢిల్లీ,ఏప్రిల్16 (చట్టం న్యూస్):** చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా.. వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై

మిగతా 2వ పేజీలో..

# దేశాన్ని నిర్మించే దిశగా 'శక్తి' స్ఫూర్తితో సాగాలి

**మొదటి పేజి తరువాయి..**

దేశానికి స్ఫూర్తిని అందిస్తున్నారని తెలిపారు. ఇటీవల సైప్రస్‌లో జరిగిన మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో ఆర్.వైశాలి చరిత్ర సృష్టించారని అన్నారు. ఈ టోర్నమెంట్ గెలుచుకుని, మహిళల ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడే అర్హత సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచారన్నారు. ఈ విజయం భారత మహిళల ప్రపంచ స్థాయి ప్రతిభను మరోసారి నిరూపించిందన్నారు. గౌరవనీయ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ బలోపేతం చేసిన పరిపాలన, ప్రజా సేవ నుంచి నారీ శక్తి ప్రయాణం.. భారత అంతరిక్ష యాత్రల్లో రితు కరిధాల్ ప్రదర్శించిన శాస్త్రీయ నైపుణ్యం వరకు విస్తరించిందన్నారు. అలాగే ప్రపంచ బాక్సింగ్ వేదికపై ఆధిపత్యం చెలాయించి దేశ గౌరవాన్ని నిలబెట్టిన నిఖత్ జరీన్ క్రీడా నైపుణ్యం కూడా.. ఈ సాధికారత ప్రయాణం భారతదేశ రాజ్యాంగ పునాదులలో లోతుగా పాతుకుపోయిందని చెప్పారు. దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మి పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి రాజ్యాంగ వ్యవస్థాపక మాతృమూర్తులు ఈ పునాదులను తీర్చిదిద్దారన్నారు. వారి కృషి తరతరాల భారతీయ మహిళలకు న్యాయం, సమానత్వాన్ని అందించిందని పవన్ పేర్కొన్నారు. ప్రతిభకు అవకాశం లభిస్తే మహిళలు నాయకత్వం వహిస్తారని, రాణిస్తారని, దేశాలకు స్ఫూర్తినిస్తారని చరిత్ర చెబుతోందని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ స్ఫూర్తితోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 'నారీ శక్తి వందన అధినియమ్' సవరణ బిల్లు 2026ను ప్రవేశపెట్టారని తెలిపారు. శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా పరిపాలనలో వారికి న్యాయమైన స్థానం కల్పించే దిశగా ఇది చరిత్రాత్మక అడుగుగా నిలుస్తుందన్నారు. జనసేన పార్టీ మహిళా సాధికారత కోసం కేవలం మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ దృఢంగా నిలబడిందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే నిబద్ధత, సమాన అవకాశాలు, న్యాయమైన ప్రాతినిధ్యం పట్ల జనసేనకు ఉన్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తుందని తెలిపారు. మహిళలే సమాజానికి పునాది అని... కుటుంబాలను పోషించడం నుంచి దేశాన్ని తీర్చిదిద్దడం వరకు వారి పాత్రకు ప్రత్యామ్నాయం లేదని అన్నారు. ఒక మహిళ ఉన్నత స్థాయికి ఎదిగితే దేశం కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇది కొత్త హక్కులు ప్రసాదించడం కాదని.. మహిళలకు న్యాయబద్ధంగా చెందాల్సిన వాటిని పునరుద్ధరించడమే అని స్పష్టం చేశారు. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను, బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయన్నారు. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదంగా మిగిలిపోదని.. అది మన నాగరికతకు బలమైన శక్తిగా నిలుస్తుందన్నారు. న్యాయబద్ధమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించే దిశగా 'శక్తి' స్ఫూర్తితో ముందుకు సాగాలి అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

**మొదటి పేజి తరువాయి..**

అమిత్‌షా స్పందిస్తూ.. బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తంచేశారు. బిల్లు సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని, జనగణన ఎందుకు చేపట్టలేదని అఖిలేశ్ ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రక్రియ ఇప్పటికే మొదలైందన్న విషయం గుర్తించాలి. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోంది. ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదు. సమాజ్‌వాదీ పార్టీ ఇళ్లకు కూడా జాతిని ఆపాదిస్తోంది. వ్యక్తుల జనగణన జరిగిన సమయంలోనే జాతి ప్రస్తావన ఉంటుందని కేంద్ర మంత్రి కౌంటర్ ఇచ్చారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. దక్షిణాది ప్రాంతాలకు ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తుందన్నారు. ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, అవి శాండ్‌విచ్ బిల్లులని డీఎంకే ఆరోపించింది.మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై లోక్‌సభలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ ప్రక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూకుడులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది. మొదటగా జనగణనతో ఈ ప్రక్రియను స్టార్ట్ చేయాలి' అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ వాదనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నాను' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు.

# మంత్రాలయం ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

**మొదటి పేజి తరువాయి..**

శ్రీరాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు కర్ణాటక వాసులు బొలెరో వాహనంలో వెళు న్నారు. ఈ వాహనం ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించారు. 13 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలికలు ఉన్నారు. వీరంతా కర్ణాటకలోని చిక్‌మంగళూరు వాసులని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఘటనపై ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# బోట్లు తయారీ కంపెనీని తరిమేస్తారా

**మొదటి పేజి తరువాయి..**

కూల్చేస్తాం.. ఏమిటీ దుర్మార్గ పనులు జగన్‌రెడ్డి? అంటూ వైసీపీ అధినేతను మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా సూటిగా నిలదీశారు. దేశ రక్షణకు అధునాతన బోట్ల తయారీ కంపెనీ రాష్ట్రానికి వస్తే.. స్వాగతించాల్సింది పోయి తిరిమేస్తానంటారా? ఇదేం రాక్షస మనస్తత్వం? అంటూ జగన్ వైఖరిని మంత్రి లోకేశ్ ఎండగట్టారు. మత్స్యకారుల పిల్లలకు వెయ్యికిపైగా ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి అడ్డుకుంటామనడం సైకోయిజమే అవుతుందంటూ జగన్ వ్యక్తిత్వాన్ని మంత్రి లోకేశ్ వివరించారు.

# రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా కుట్ర

**మొదటి పేజి తరువాయి..**

ప్రాజెక్టులకు రిబ్బన్ కటింగ్ చేయడం గత ప్రభుత్వ అలవాటని విమర్శించారు. సరైన ప్రణాళిక లేకుండా డీపీఆర్‌లు తయారు చేసి పంపించారని, దీంతో అనేక ల్యాండ్ ఇష్యూలు తలెత్తాయని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక వాటిని పరిష్కరించి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. తన హయాంలో జువ్వలదిన్నె ప్రాజెక్టు పనులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పీపీపీ మోడల్‌లో విద్యాసంస్థలపై వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామని, జగన్ చెప్పిన లెక్కలు తప్పని ప్రజల ముందు నిరూపిస్తామని అన్నారు. మత్స్యకారుల సమస్యలపై స్పందిస్తూ వారి హక్కులను గౌరవిస్తామని, అవసరమైతే ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని తెలిపారు. తమిళనాడు నుంచి వచ్చిన మత్స్యకారులు మెకనైజ్డ్ బోట్లతో వచ్చి ఇబ్బందులు సృష్టించారని, ఆ బోట్ల స్వాధీనంపై కూడా వివాదాలు ఉన్నాయని పేర్కొన్నారు. కళ్లు మూసుకుంటేనే మూడేళ్లు అయిపోతాయని చెప్పే జగన్, అయిదేళ్లు కళ్లు మూసుకుని రాష్ట్రాన్ని నాశనం చేశాడని మంత్రి మండిపడ్డారు. ఇప్పుడు మళ్లీ కళ్లు మూసుకుంటే రాజకీయంగా జగన్ కనిపించకుండా పోతాడంటూ బీసీ జనార్ధన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటి పేజి తరువాయి..**

బాధితులను జిల్లా కలెక్టర్ సిరి పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడి.. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందిన నలుగురు క్షతగాత్రులు డిశార్చ్ అయ్యారన్నారు. మిగిలిన వారు.. కర్నూలు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. బొలెరో వాహనం డ్రైవరు నిద్ర మత్తులో ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు.



## మంత్రాలయం ప్రమాద ఘటన

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రులు**

**అమరావతి,ఏప్రిల్16 :** మంత్రాలయం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. మంత్రాలయం క్షేత్రం దర్శనం కోసం వస్తున్న కర్ణాటకకు చెందిన భక్తులు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారని అధికారులు వివరించారని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. కర్ణాటకలోని ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని బాధిత కుటుంబాలకు తగిన సహాయం చేయాలని కూడా సూచించా మన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో కర్ణాటకకు చెందిన 8 మంది మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. బొలెరో వాహనం రెడీమిక్స్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రాలయం జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి మున్ముందు ఈ తరహా ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ గుప్తా ప్రకటించారు. కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను ఆయన పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించినట్లు మంత్రి భరత్ గుప్తా తెలిపారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై హోం మంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందడం అత్యంత విచారకరమన్నారు. ట్యాంకర్‌ను ?బొలెరో వాహనం ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకోవడం దురదృష్టకరమని తెలిపారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితులకు తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. కర్నూలు రోడ్డు ప్రమాదం బాధాకరమని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. బొలెరో వాహనం - ట్యాంకర్ ఢీ కొన్న ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోవడం విషాదకరమన్నారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

**మొదటి పేజి తరువాయి..**

వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఎండ వేడిమి నుండి తట్టుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ప్రత్యేక వాతావరణం చూస్తామని ఈ కారణంగా కొన్ని కఠినమైన పరిస్థితులు ఎదురవుతా యని వాతావరణ శాఖ అలర్ట్ చేసింది.

వడగాలులు సాధారణ

రోజుల కన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతమైన కోస్తా జిల్లాల్లో వడగాలు పలు ప్రభావం నుంచి బయటపడే ఆలోచన చేయాల్సి ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రల్లో కనీసం ఐదుగురు వడగాల్పులకు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉష్ణోగ్రత 45 డిగ్రీల నుండి 55 డిగ్రీల వరకు అత్యధిక వేడిమి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో డాక్టర్లు, శాస్త్రజ్ఞులు సైతం మానవ సహిత జీవజాలాన్ని, జంతు జాలాన్ని వేడివాతావరణంలో ఎలా రక్షించుకోవాలో, సూచిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఎవరూ బయటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉక్కపోత అధికం గా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది. వేసవి ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉన్నప్పుడు బయట ఎక్కువసేపు తిరిగే వారిలో డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడంవంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఎండల ధాటి 40-45 డిగ్రీలకు చేరుకుంటే, ప్రమాద స్థాయి మరింతగా పెరుగుతుంది. గడచిన పదేళ్లలో తెలుగు రాష్ట్రల్లో సగటు గరిష్టఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి.

విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47డిగ్రీల వరకు కూడా నమోదవుతున్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది. ఎల్నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్నినో పరిస్థితులు 2023లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అత్యల్ప వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఎల్నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది.

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

**మొదటి పేజి తరువాయి..**

దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ధి ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.

# చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టిన కేంద్రం

**మొదటి పేజి తరువాయి..**

చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీటిపై ఓటింగ్ నిర్వహించ నున్నట్లు సభాపతి తెలిపారు. ఈ మూడింటిలో లోక్‌సభ సీట్లను 550 నుంచి గరిష్ఠంగా 850కి పెంచడంతో పాటు 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, లోక్‌సభ- అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మరో బిల్లు ఉన్నాయి. వీటిని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టారు. ఇక, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే ఇంకో బిల్లును హోంమంత్రి అమిత్ షా సభ ముందు ఉంచారు. వీటిపై లోక్‌సభలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. ప్రధాని మోదీ ఈ సాయంత్రం లోక్‌సభలో ప్రసంగిస్తారు. ఇందులో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు. మిగతా రెండూ చట్టపరమైన బిల్లులు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. మిగతా రెండింటికీ సాధారణ మెజారిటీ సరిపోతుంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 2/3వ వంతు మెజారిటీతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 360 మంది సభ్యుల మద్దతు అవసరం. అధికారిక ఎన్డీయే కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. బిల్లు ఆమోదానికి మరో 68 మంది మద్దతు అవసరం. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న ఇండియా కూటమి ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని చెప్పడంతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంపై ఉత్కంఠ నెలకొంది.

----------------

# తీర ప్రాంత భద్రతకు సాగర్ డిఫెన్స్ అవసరం

## దానిని కూడా రాజకీయం చేయడం జగన్‌కే చెల్లింది

## జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు

**అమరావతి,ఏప్రిల్16 :** వైఎస్ జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్‌కు తల్లి, చెల్లి, రాష్ట్రం, దేశం పట్ల ఎలాంటి బాధ్యతా భావం, భక్తి లేవని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. తీర ప్రాంత భద్రతను బలోపేతం చేయడానికి రానున్న సాగర్ డిఫెన్స్ ప్రాజెక్టును కూడా తరిమేస్తానని జగన్ మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో శత్రు దేశాల నుంచి వచ్చే ముప్పులను ఎదుర్కొనేందుకు ఈ ప్రాజెక్టు అవసరమని ఆయన పేర్కొన్నారు. తీర ప్రాంతంలో తమిళనాడు మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి వచ్చి సమస్యలు సృష్టించడం పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. జగన్ హయాంలో మెరైన్ పోలీసుల గస్తీ బలహీనపడిందని పేర్కొన్నారు. 144 గ్రామాలకు సంబంధించిన గ్రామ కాపుల సమావేశాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విశాఖపట్నం, కాకినాడ, జువ్వలదిన్నెలలో ఫిషింగ్ హార్బర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జెట్టీలు నిర్మించామని తెలిపారు. వైఎస్ఆర్ నుంచి జగన్ వరకూ మత్స్యకారులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. సోంపేట ఘటనలో మత్స్యకారులపై కాల్పులు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ఇచ్చే పరిహారాన్ని రూ.4 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచినట్టు తెలిపారు. మత్స్యకార సంక్షేమం కోసం కేంద్రం ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదని, ఫిష్ ఆంధ్రా పేరుతో నిధులు మళ్లించారని ఆరోపించారు. ప్రధాని మత్స్య సంపద యోజన కింద మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు

# బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం...

**ఏల్పుకొండ రామకృష్ణ టీఆర్ఎస్వి నాయకులు.**



**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్,ఏప్రిల్ 16 (చట్టం న్యూస్) :** తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన ఒక ధర్మపోరాటం. వందలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను, భారత్-పాక్ విభజనతో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ట.

ఇది కేవలం చరిత్రను వక్రీకరించడమే కాదు, తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ఘోరంగా అవమానించడమే.

తెలంగాణ రాష్ట్రాన్ని దేశ విభజనతో పోల్చడం అంటే తెలంగాణ అమరవీరుల త్యాగాలను, కోట్లాది ప్రజల ఆకాంక్షలను, ఉద్యమ గర్వాన్ని అవమానించడం.

కెసిఆర్ నాయకత్వంలో, విద్యార్థులు--ఉద్యోగులు--ప్రజల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణను అవహేళన చేసే హక్కు ఎవరికీ లేదు.

తేజస్వీ సూర్య గుర్తుంచుకో --- తెలంగాణను భిక్షగా తెచ్చుకోలేదు... కెసిఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్నాం.

తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలియకపోతే ముందుగా చదువు,

తర్వాత ఈ నేల గురించి మాట్లాడు.

తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీసే ప్రతి వ్యక్తికి ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టి సమాధానం ఇవ్వడం ఈ నేలకి తెలుసు.

వెంటనే నీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.

లేకపోతే తెలంగాణ విద్యార్థి లోకం, ఉద్యమ శక్తి బీజేపీకి రాజకీయంగా సమాధానం చెబుతుంది.

తెలంగాణ గడ్డపై గెలిచి, పార్లమెంటులో మన రాష్ట్ర గౌరవం మంటగలుస్తుంటే నోరు మెదపకుండా చూస్తూ కూర్చున్న ఆ 8 మంది బీజేపీ ఎంపీలను తెలంగాణ ప్రజలు ప్రతిదీ చూస్తున్నారు.రాబోయే ఎలక్షన్స్ లో బీజేపీ కి ఓటు తో ప్రజలు గుణపాఠం చెబుతారు అని తెలియచేస్తూ హెచ్చరిస్తున్నాం.

# నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేయాలి

- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ అభివృద్ధి సంస్థ యాక్షన్ ప్లాన్ పై సమీక్ష**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ) ఏప్రిల్ 16, (చట్టం బ్యూరో ) :** ప్రభుత్వ పథకాలకు నిబంధనలకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ అభివృద్ధి సంస్థ (ఎస్సీ కార్పొరేషన్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన " డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ" సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఎస్సీ యాక్షన్ ప్లాన్-2025-26 కి సంబంధించిన అంశాలు, మండలవారీగా లక్ష్యాలను కమిటీ ముందు ప్రవేశ పెట్టి వారి సంయుక్తంగా ఆమోదం పొందటం జరిగింది. అలాగే లబ్ధిదారుల ఎంపిక కోసం ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 గైడ్ లైన్స్ ప్రకారంగా "మండలస్థాయి ఎంపిక కమిటీ"ని ఏర్పాటు చేశారు.

ఈడీ ఎస్సీ కార్పొరేషన్ కింద వ్యవసాయ రంగం ( సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్), పశు పోషణ రంగం ( 2 మిల్క్ అనిమల్స్), రవాణా రంగం ఈవీ త్రీ వీలర్స్ (గూడ్స్), ఈవీ త్రీ వీలర్స్ (ప్యాసింజర్స్), ఈవీ టు వీలర్స్ పరికరాలు సబ్సిడీ పై అందుబాటులో ఉన్నాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. లబ్ధిదారుల, మండల స్థాయిలో లక్ష్యాల కేటాయింపు అన్నీ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో చేయాలని సూచించారు.

సమావేశంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, జనరల్ మేనేజర్ (జిల్లా పరిశ్రమలు) హనుమంతు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మండల స్థాయి సమావేశం.





**పెగడపల్లి, ఏప్రిల్ 16( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయుచున్నటువంటి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మండల స్థాయి సమావేశాన్ని మండల కేంద్రంలోని నందగిరి రోడ్డులో గల రెడ్డి ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశమునకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ పి. శశికుమార్ రెడ్డి, సభ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథి లు గా ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్,పెగడపల్లి సర్పంచ్ ఓరుగల అరుణ హాజరయ్యారు మండల స్థాయి అధికారులు తమ శాఖల ద్వారా లబ్ది పొందిన వారి యొక్క వివరాలను అధికారులు స్వయంగా తెలియజేశారు. అనంతరం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు తమ యూనియన్ డైరీని ఎంపీడీవో చే ఆవిష్కరణ గావించారు. ఈ కార్యక్రమానికి పెగడపల్లి మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతు సంఘ సభ్యులు యువజన సంఘ సభ్యులు మరియు మహిళా సంఘ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అర్హులకు పథకాలు చేరేలా కట్టుదిట్టమైన అమలు చేయండి

**జడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి**



**రాయికల్ ఏప్రిల్ 16 చట్టం :** పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మండల స్థాయి సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్యేక అధికారి, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గౌతమ్ రెడ్డి హాజరై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, మహాలక్ష్మి, గృహజ్యోతి, సన్నరైతులకు బోనస్, పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, రేషన్ కార్డులు వంటి పథకాల అమలు తీరును సమీక్షించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకాలు పారదర్శకంగా, సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా శాఖల మధ్య సమన్వయం పెంచాలని, ప్రణాళికలో పేర్కొన్న లక్ష్యాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచిపెట్టే బిల్లు

**మహిళా బిల్లుపై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ అక్కసు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్16 :** పార్లమెంట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన బిల్లుపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ చర్చను ప్రారంభించారు. అయితే.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు. ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.

# తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/ఏప్రిల్ 16 ,(చట్టం బ్యూరో) :** కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ ఆర్ట్స్ విభాగం విద్యార్థులు సీనియర్లకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమం - " ఎకోస్ ఆఫ్ మెమోరీస్" చాలా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల స్థాయిలో చక్కని క్రమశిక్షణతో పట్టుదలతో కృషితో ఉన్నత స్థాయికి చేరుకొని సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ టి రాజయ్య మాట్లాడుతూ విద్యార్థులు శ్రమతో కూడిన జీవితం కొనసాగిస్తూ తమ తల్లిదండ్రులను కలలు కన్న ఆశయాలు నెరవేర్చాలని కోరారు. తదనంతరం జూనియర్ సీనియర్ విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమావేశంలో స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా.మల్లారం శ్రీనివాస్ రెడ్డి ఐ క్యూ ఎసి సమన్వయకర్త డా. హర్ జ్యోతి కౌర్, కళాశాల ఏవో ఉమా రాణి, సామాజిక శాస్త్రాల విభాగాధిపతులు అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




## తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులుగా ఎదురుగట్ల అజయ్ నియామకం



తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులుగా చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ఎదురు గట్ల అజయ్‌ని నియమిస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేయాలని తెలిపారు. తమ నియామకానికి కృషిచేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అమ్మిగల్ల గోపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్ , లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు .

## ఘనంగా తెలుగు నాటకరంగ దినోత్సవం




**కొడిమ్యాల, ఏప్రిల్ 16(చట్టం) :** శ్రీ తారకరామ కళానిలయం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో తెలుగు నాటకరంగ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నాటకరంగానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ..నాటకరంగంలో ప్రతి ఒక్కరూ ముందుండి మరుగున పడుతున్న కళలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుగ్గిళ్ళ హన్మయ్యచారి, ఏనుగు ఆదిరెడ్డి, డా. పి.తిరుపతి, ఇనుగంటి సత్యానందం, నిజాం రాజన్న, బోయిని రాజయ్య, కంచర్ల గంగాచారి, గజ్జల కర్ణాచారి, బల్ల చిన్న అంజయ్య, రాపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎమ్మార్వో కు ఘన సన్మానం



**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 16 ,(చట్టం న్యూస్) :** బోయిన్ పల్లి మండలం నూతన ఎమ్మార్వో గా బాధ్యతలు చేపట్టిన వీసీ షరీఫ్ మొయినోద్దీన్ మర్యాదపూర్వకంగా సామాజిక సేవకులు సింగిరెడ్డి బాలమల్లు కలసి శాలువాతో సన్మానించి వివిధ అంశాల చర్చించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన షేక్ రియాజ్



**నార్పల: ఏప్రిల్ 16, (చట్టం) న్యూస్ :** నార్పల మండలంకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ రియాజ్ అత్యధిక మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. షేక్ రియాజ్ 1000కి892 మార్కులు సాధించి కాలేజీ టాపర్ లలో మూడవ స్థానం, బాయ్స్ లో మొదటి స్థానాన్ని పొందాడు. తమ కాలేజీకి చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత చెందడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ బాలప్ప హర్షం వ్యక్తం చేశారు. తమ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని, తమ అధ్యాపక బృందం మెరుగైన ఫలితాలు సాధించడం కోసం అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు.

## వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార ప్రతినిధిగా గుండె కార్ల శ్రీనివాస్ నియామకం



**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 16 ,(చట్టం న్యూస్ ) :** తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార ప్రతినిధి గా బోయిన్ పల్లి మండలం కొత్త పేట గ్రామానికి చెందిన వార్డు సభ్యులు గుండె కార్ల శ్రీనివాస్ ని నియమిస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేయాలని తెలిపారు. తమ నియామకానికి కృషిచేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అమ్మిగల్ల గోపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్ , బోయిన్ పల్లి మండల అధ్యక్షులు నాగుల రవి వర్మ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు .

# చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా ?

అంబేడ్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే..పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిడిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేడ్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగంలో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్ధాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మండి మాద్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొందరెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది. ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయరయ్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు,విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్దతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ద ఉంటే ఈ రకమైన చట్టసవరణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి. కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ పక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరుగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఎ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గతంలోనే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజంగానే గత ఎన్నికల్లోనే ఈ చట్టం అమలు చేసి ఉంటే పేచీ వచ్చేది కాదు. కానీ మోడీ ప్రభుత్వం తన రాజకీయాలను తాను ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనను 2029 సార్వత్రిక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది. 2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి చేసేలా చట్టసవరణకు పూనుకున్నారు. అంటే మోడీ కూడా రాజకీయ ఎత్తుగడలతోనే ఉన్నారు. ఇలా చేయడం వల్ల పాతవారే ఎన్నికవుతారు. అలాగే కొందరి నియోజకవర్గాలు గల్లంతవుతాయి. అయితే మహిళలకు ఎప్పుడో చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాల్సి ఉంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, డీ లిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని సభలో సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అయితే అలా చేయకుంటే ఇప్పుడున్న సీట్లతోనే మహిళలకు సీట్లు సర్దుబాటు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్దంగా లేదు. ఇదంతా ఒక ఎత్తయితే చట్టసభలో సభ్యుల పదవీకాలాన్ని నిర్దేశించాలి. ఎన్ని పర్యాయాలు ఎంపిలుగా ఉండాలో, ఎమ్మెల్యేలుగా ఉండాలో నిర్ణయించాలి. కొందరే నిరంతరాయంగా చట్టసభలకు పరిమితం అయ్యే విధానం పోవాలి. ఇది జరిగితే తప్ప భారతప్రజాస్వామ్యానికి అర్థం లేదు.

## పెద్దపల్లి దేవేందర్ జ్ఞాపకార్థం మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/ ఏప్రిల్ 16,( చట్టం బ్యూరో) :** పెద్ద పెల్లి దేవేందర్ మూడవ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ 2 బస్ డిపో సిబ్బందికి జ్ఞాపకార్థం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడప కోటేష్ కుమార్, నాయకులు సంధిరి నరహరి, మల్లేశం, రమేష్ డిపో మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం

**వెల్గటూర్, ఏప్రిల్16 (చట్టం):** జగిత్యాల జిల్లావెల్గటూర్ మండలం ఏప్రిల్ 16 తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా వెల్గటూర్ మండల కేంద్రంలో 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై స్థానిక వి, ఎస్,ఆర్, ఫంక్షన్ హాల్, లో ఈ రోజు మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులు,ప్రజా సమస్యల పై చర్చించారు. ఈ కార్యక్రమం లో అధికారులు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# వేసవి రద్దీకి అనుగుణంగా రైళ్లు

## అనంత మీదుగా యశ్వంతపూర్-జల్పైగురి మధ్య రెండు ట్రైన్స్

అనంతపురం,ఏప్రిల్16 : వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని అనంతపురం మీదుగా యశ్వంతపూర్-జల్పైగురి మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. యశ్వంతపూర్-న్యూ జల్పైగురి ప్రత్యేక రైలు (నం. 06567) ఈనెల 17, 24 తేదీల్లో (శుక్రవారాల్లో) యశ్వంతపూర్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి మూడోరోజు సోమవారం ఉదయం 7 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.06568) ఈనెల 20, 27 తేదీల్లో (సోమవారాల్లో) న్యూ జల్పైగురి స్టేషన్‌లో ఉదయం 8.30కి బయలుదేరి మూడో రోజైన గురువారం ఉదయం 9.55 గంటలకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హాంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, నంద్యాల, మార్కాపూర్ రోడ్, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, కొత్తవలస, విజయనదరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, బాలుగావ్, ఖుద్రా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కెయోంజహార్ రోడ్, భద్రక్, ఖరగ్‌పూర్, అందుల్, డాన్కుని, బర్ధమాన్, బోల్పూర్ (శాంతినికేతన్), రాంపూర్ హట్, న్యూ ఫరక్కా, మాల్డా టౌన్, కిష్ణాగంజ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. ప్రయాణికుల రద్దీ నియంత్రణకు యశ్వంతపూర్-సహర్స మధ్య వయా గుత్తి మూడు ట్రిప్పుల ప్రత్యక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సహర్స- యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నం. 05551)ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకూ గురువారాల్లో రాత్రి 10.25 గంటలకు సహర్సలో బయలుదేరి రెండు రోజుల తర్వాత శనివారం రాత్రి 10.30కి యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 05552) ఈ నెల 19 నుంచి మే 3వ తేదీ వరకూ ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి రెండు రోజుల తర్వాత మంగళవారం ఉదయం 11 గంటలకు సహర్సకు చేరుతుందన్నారు. ఈ రైలు సిమ్రి భక్తియార్పూర్, మన్సి, ఖగారియా, బెగుసరాయ్, న్యూ బరౌని, కియుల్, ఝఝా, జసిది, మధుపూర్, చిత్తరంజన్, అశన్‌సోల్, దుర్గాపూర్, బర్ధామన్, డంకుని, ఖరగ్‌పూర్, బేలేశ్వర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుద్రా రోడ్, విజయనగరం, విశాఖపట్టణం, దువ్వాడ, విజయవాడ, గుత్తి, ధర్మవరం, హిందూపురం, యల్హాంక స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

# జనగణనలో వివరాలు నమోదు చేసిన చంద్రబాబు

## ప్రజలు అంతా జనగణనలో పాల్గొనాలని పిలుపు



అమరావతి,ఏప్రిల్16 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వీయ జనగణనలో తన వివరాలను నమోదు చేసుకున్నారు. జనగణన పక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా ఆన్ లైన్ ద్వారా వివరాల నమోదు పక్రియ గురువారం ప్రారంభమైంది. వెబ్ సైట్ ద్వారా ముఖ్యమంత్రి వివరాలను నమోదు చేసుకున్నారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ పక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని ముఖ్యమంత్రికి తెలిపారు. మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన పక్రియను చేపడతారని తెలియచేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. దీని కోసం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించటం అవసరమని, ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఏపీలో జనగణన కార్యక్రమం జరుగుతోందని, ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరగనుందని, మొదటి దశలో ఇవాల్టి నుంచే ఇండ్ల గణన ప్రారంభమైందని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. సరైన వివరాలను నమోదు చేయటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరారు. జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

- వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే
- దీనిపై బిజెపి ఎంపిలు నోరు మెదపరా
- జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు



హైదరాబాద్,ఏప్రిల్16 :తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి పోరాటాన్ని అంతలా కించపరుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు.మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆమె విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లుపై ఢిల్లీ వేదికగా కవిత మాట్లాడుతూ.. 'మహిళ బిల్లుకు డీలిమిటేషన్ బిల్లును లింక్ చేయటం పెద్ద కుట్ర. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిస్తే ఊరుకునేది లేదు. ఒకవేళ డీలిమిటేషన్ పేరుతో తెలంగాణ సీట్ల సంఖ్యను తగ్గిస్తే, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరో ఉద్యమం తప్పదు. మహిళా రిజర్వేషన్లలో కచ్చితంగా బీసీ సబ్ కోటా ఉండాలి. అప్పుడే వెనుకబడిన వర్గాల మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం దక్కుతుంది' అని అన్నారు.

# ప్రజా సంక్షేమంగా పాలన అందించడమే ధ్యేయం

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**





**భూదాన్ పోచంపల్లి , ఏప్రిల్ 16 (చట్టం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు . పట్టణ కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం గురువారం జరిగింది . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో అధికారులు పారదర్శకంగా ఉండాలని సూచించారు . అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు వారధిగా ఉండాలన్నారు . ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు ప్రజాప్రతినిధులపై ఉందన్నారు . వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు . ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికై కార్యచరణకు చర్చ జరిపారు . మండలంలో 15 మంది లబ్ధిదారులకు ప్యాడి క్లీనర్ యంత్రాలను అందజేశారు . కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు . కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు , జెడ్పి సీఈవో శోభారాణి ,ఆర్డీవో శేఖర్ రెడ్డి , మండల ప్రత్యేక అధికారి రోహిణి , పురపాలిక కమిషనర్ అంజన్ రెడ్డి , తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి , ఎంపీడీవో భాస్కర్ పాల్గొన్నారు .

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో గ్రాడ్యుయేషన్ వేడుకలు







రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో యూ కే జీ విద్యార్థులకు గురువారం స్థానిక మార్కండేయ ఫంక్షన్ హాల్ లో గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ విద్యా ప్రయాణంలో మొదటి మెట్టును విజయవంతంగా పూర్తి చేసి, ఈ వేడుక ద్వారా కొత్త దశలోకి అడుగుపెట్టారు. ఈ కార్యక్రమంలో పిల్లలు పాటలు, శ్లోకాలు, నృత్యాలతో తమ ప్రతిభను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని పిల్లలను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "పిల్లల భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉండాలని, వారు మంచి విద్యతో పాటు మంచి విలువలను కూడా అలవరచుకోవాలి" అని సూచించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేసిశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జె వేణుగోపాలరావు, డైరెక్టర్ జె తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మరియు పోషకులు పాల్గొన్నారు.

# సకల జనుల సంతోషమే ప్రభుత్వ ధ్యేయం



**మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్,**

**వెల్గటూర్, ఏప్రిల్ 16 (చట్టం):** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ పెగడపల్లి మండలం రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా పెగడపల్లి మండల స్థాయి సమావేశంలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక నియోజకవర్గానికి 3500, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా లక్షలాది రేషన్ కార్డులు మంజూరు చేశారని అదేవిధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని గ్రామ జ్యోతి ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నారని 500 కి గ్యాస్ సిలిండర్ ఇస్తున్నారని రైతు, భరోసా కొనసాగిస్తూ రైతులకు రెండు లక్షల లోపు రైతు రుణమాఫీ చేశారని 74 వేల ఉద్యోగాలు కల్పించాలని మహిళలకు అన్ని విధాల చేదోడుగా ఉంటూ మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది అని అన్నారు అదేవిధంగా మధ్యతరగతి కుటుంబాల వారందరూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలని విజ్ఞప్తి చేశారు అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా రాబోవు రోజుల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేశారు అదేవిధంగా రాబోవు కాలంలో లబ్ధిదారులను గుర్తించి తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివ సహకారంతో రెండో విడత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేపిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సమావేశ నిర్వాహకులు ఎంపీడీవో శశి కుమార్ రెడ్డి, తహసీల్దార్ ఆనంద్, కుమార్.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్,ఏపిఎం రవివర్మ,ఏపీవో అనిల్,ఏవో శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ జ్యోతి, ఎంఈఓ సులోచన, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్థానిక సర్పంచ్ వర్గాల అరుణ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు అన్ని గ్రామాల సర్పంచ్ ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జగిత్యాల జనగర్జనను జయప్రదం చేయాలి

**...మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్**



**రాయికల్ ఏప్రిల్ 16 చట్టం :** జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జగిత్యాల జనగర్జనను జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్ అన్నారు. గురువారం రాయికల్ పట్టణంలోని వర్తక సంఘంలో బిఆర్ఎస్ ముఖ్య నేతలు,జీవన్ రెడ్డి అభిమానులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకొని దిశా నిర్దేశం చేశారు. లక్ష మందితో జరగబోయే ఈ సభ ద్వారా ఉత్తర తెలంగాణలో పార్టీని జగిత్యాల నుండే జైత్రయాత్రను ప్రారంభించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాయికల్ పట్టణంలో 12 వార్డుల్లో ఇన్చార్జిలను ఏర్పాటుచేసి జన సమీకరణకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి కెసిఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరిక, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, కేసీఆర్ సమక్షంలో భారీ చేరికలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎలిగేటి అనిల్, తురగ శ్రీధర్ రెడ్డి, మ్యాకల రమేష్, కొయ్యేడి మహిపాల్, రాకేష్ నాయక్, మారంపల్లి సాయికుమార్, మహేందర్, దాసరి గంగాధర్, ఏనుగందుల లింగం గౌడ్, బత్తిని భూమయ్య, షాకీర్, మొభిన్,శ్రీకాంత్, దిలీప్, డకుంట్ల నరేష్, బొంగుని భూమా గౌడ్,కట్ల నర్సయ్య, రామచంద్రం ,విక్రమ్ ,వంశీ, తిరుపతి,రమేష్,నరేష్, షంషిర్, నవీన్, భూమయ్య,గణేష్,రమణ,రాజారెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించండి





- **రోడ్డు భద్రతలపై అవగాహన**
- **ఎస్సై సుదీర్ రావు**

**రాయికల్, ఏప్రిల్ 16 చట్టం :** ఆటో డ్రైవర్లు ప్రయాణాల సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి క్షేమంగా గమ్యస్థానానికి చేరాలని ఎస్సై సుదీర్ రావు అన్నారు. గురువారం రాయికల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో యువత, ఆటో డ్రైవర్, ప్రజాప్రతినిధులకు "అరైవ్ ఎలైవ్" రోడ్డు ప్రయాణ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్, వాహనాల చోదకులకు రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు వినియోగించాలని సూచించారు. పరిమితికి మించి ఓవర్ లోడు ప్రయాణం చేయకూడదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల దీనస్థితిని వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉందని పోలీసులు పిలుపునిచ్చారు. అనంతరం ఆటో డ్రైవర్లకు ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్, తాహసిల్దార్ నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, కౌన్సిలర్ రాకేష్, నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి, మచ్చ శేఖర్, బాపురపు రాజీవ్,సాయి,ఏఎస్ఐ సైఫోద్దీన్, పోలీస్ సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో వృద్ధులకు గర్భిణీ స్త్రీలకు మజ్జిగ బ్రెడ్లు పంపిణీ





**ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్**

**నార్పల ఏప్రిల్ 16,(చట్టం) న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా నార్పల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వృద్ధులకు గర్భిణీ స్త్రీలకు బ్రెడ్, మజ్జిగ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్పల మండలానికి దిశా దశ నాయకుడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్న వ్యక్తి నిండు నూరేళ్లు జీవించాలని భవిష్యత్తులో మరెన్నో పదవులు పొంది నార్పల మండలం అభివృద్ధి తోడ్పడే విధంగా కృషి చేయాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు గారు మండల ఉపాధ్యక్షులు సూరి, ఎంపీటీసీ కాటమయ్య, మండల ప్రధాన కార్యదర్శి చిగిచెర్ల రామయ్య, వేదాంత మోహన్, పవన్ కుమార్, బండ్లపల్లి ఆదినారాయణ, మనోహర, ముత్యాలు, కడపల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు



## తల్లిదండ్రుల కష్టానికి ఫలితం.. 974 మార్కులతో సాకే భావన,మెరిసింది




Hall Ticket : 2625224777
Name : SAKE BHAVANA
Total : 974(PASS/A)

**నార్పల, ఏప్రిల్ 16,(చట్టం) న్యూస్ :** నార్పల మండలం అంబేద్కర్ కాలనీ, చెందిన విద్యార్థిని సాకే భావన ఇంటర్ ఎంపీసీ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి 974,మార్కులు సాధించింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి ఈ అత్యుత్తమ మార్కులు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. సాకే భావనతండ్రి సాకే ఆంజనేయులు, తల్లి సాకే పద్మావతి,కుటుంబానికి రెండుఎకరాల పొలం ఉన్నప్పటికీ, వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం సరిపోక తల్లి కొరపాడు గురుకుల పాఠశాల నందు దిన సరి కూలి కింద కష్టపడి పనిచేస్తూ అదేవిధంగా తండ్రి రోజు వారి పెయింటింగ్ కూలి వర్క్ చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తూ కుమార్తె చదువుకు అండగా నిలిచారు. ప్రస్తుతం సాకే భావన కురుగుంట, ఇంటర్మీడియట్ గురుకుల పాఠశాల నందు చదువుతోంది.

తల్లిదండ్రుల కష్టాన్ని దగ్గరగా చూసిన సాకే భావనవారి శ్రమ వృథా కాకూడదనే సంకల్పంతో కష్టపడి చదివి ఈ ఘన విజయం సాధించింది. ఆమె సాధించిన 974, మార్కులు కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలను ఆనందంలో ముంచెత్తాయి.

గ్రామ పెద్దలు, బంధువులు, స్నేహితులు సాకే భావన అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల శ్రమ, విద్యార్థిని పట్టుదల కలిసివస్తే ఎలాంటి విజయాలు సాధించవచ్చో సాకే భావననిరూపించిందని గ్రామస్థులు ప్రశంసించారు.



AP ఇంటర్ పరీక్షా ఫలితాలు 2026

Hall Ticket : 2625224777
Name : SAKE BHAVANA
District : ANANTHAPURAMU
Total : 974 ( PASS/A )

ఇంటర్ ఫలితాల కోసం డౌన్లోడ్ way2news #IndiaReadsWay2News

2nd year 1st year

| | SUBJECT | marks | status |
|---|---|---|---|
| 1 | ENGLISH PAPER-II | 94 | P |
| 2 | TELUGU PAPER-II | 99 | P |
| 3 | MATHEMATICS PAPER-... | 75 | P |
| 4 | MATHEMATICS PAPER-... | 71 | P |
| 5 | PHYSICS PAPER-II | 58 | P |
| 6 | CHEMISTRY PAPER-II | 60 | P |
| 7 | PHYSICS PRACTICAL | 28 | P |
| 8 | CHEMISTRY PRACTICAL | 30 | P |

Download Share

Please Take A Screenshot & Share Disclaimer

## అయితుపల్లి అంగన్వాడి రెండు, మూడు కేంద్రాలలో పోషక పక్వాడ కార్యక్రమం.

**అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో**





**పెగడపల్లి ఏప్రిల్ 16( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని అయితుపల్లి గ్రామంలోని అంగన్వాడి రెండు,మూడు కేంద్రాలలో పోషక పక్వాడ కార్యక్రమం అంగన్వాడీ టీచర్లు అంజమ్మ, మిర్యాని,నిర్వహించారు. టీచర్లు మాట్లాడుతూ జంక్ ఫుడ్ ప్యాకేజీ ఫుడ్ వల్ల అనారోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఆయలు, పిల్లల తల్లిదండ్రు పాల్గొన్నారు.

## నార్పల సత్యనారాయణ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్



**నార్పల, ఏప్రిల్ 16, (చట్టం) న్యూస్ :** నార్పల మండల కేంద్రంలో అనంతపురం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా ఆయనకు శాలవాలు పూలమాలతో ఘనంగా జన్మదిన వేడుకలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షు లు ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఘనంగా చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్పల మండలానికి దిశ దశ కలిగిన నాయకుడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్న ప్రజా నాయకుడు అదేవిధంగా ఇంకా భవిష్యత్తులో మంచిపదవులు పొంది మండలానికి ఇంకా మరెన్నో సేవ చేయాలని భవిష్యత్తులో ఆయనకు ఆయురారోగ్యాలు దేవుడు ప్రసాదించాలని ఇలాంటి పుట్టినరోజులు ఇంకా ఎన్నో జరుపుకోవాలని దేవుని మనసా వాచా కోరుకుంటూ ఇప్పుడు ఆయన నవ్వుతూ సంతోషంగా ప్రజల మధ్య ఉండాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, సాకే రామాంజనేయులు, సూరి, ఎంపీటీసీ కాటమయ్య, చిగి చెర్ల రామయ్య, సాకే ఆంజనేయులు, బండ్లపల్లి ఆదినారాయణ, వేదాంత మోహన్, అడవి రాజు, ఎట్టి తిరుపాలు, బూసి నారాయణస్వామి, సాకే ముత్యాలు, కడపల ఆదినారాయణ, కుమారు తదితరులు పాల్గొన్నారు




95814 19999
## చట్టం సాహితీ లోకం

## మంగళసూత్రం



యుక్తవయసు రాగానే ఆడ మగలకు చేస్తారు వివాహం
ఆడపిల్ల వాళ్ళు చేస్తారు కన్యాదానం
మాంగల్యం తంతునానేనా అంటూ
కట్టిస్తారు మంగళసూత్రం
108 సన్నని దారాలు పేని పసుపు రాసి తాళిబొట్టు, నల్లపూసలు కలిపి కట్టడం సంప్రదాయం
మంగళసూత్రం స్త్రీలకు సౌభాగ్య చిహ్నం
ఇరు హృదయాలను కలిపే బంధం
వైవాహిక ప్రమాణాలను గుర్తుకు తెచ్చే చక్కటి కార్యం
భర్త ఆయుస్సును ప్రభావితం చేస్తుందన్న నమ్మకం
దంపతుల శాశ్వత బంధానికి నిదర్శనం
సుఖమయ జీవితానికి ప్రతీకగా నిలిపేటి సూత్రం
పసుపు తాడు ఆధారంగా వైవాహిక జీవితం ఆరంభం
దీర్ఘసుమంగళిగా ఉండాలంటూ
వేయిస్తారు మూడుముళ్ల బంధం
మహిళకు పెళ్ళి అయింది అనడానికి తాళిబొట్టే సాక్ష్యం
దీని విలువను తెలిసి చేయకూడదు నిర్లక్ష్యం
శాశ్వతమైన బంధానికి ఇది తార్కాణం
విదేశీయులు కూడా మెచ్చుకున్నారు
గొప్పదని మన వివాహ బంధం
నేటి సాంకేతిక యుగంలో తాళిబొట్టును
చేస్తున్నారు అపహాస్యం
మానసిక పరిపక్వతను కలిగి తాళిబొట్టుకు ఇవ్వాలి గౌరవం
చదువుతోపాటు నేర్చుకోవాలి సంస్కారం
ముందు తరాలకు కూడా వారసత్వంగా
ఇవ్వాలి ఈ మంగళసూత్రం
మర్చిపోకూడదు మన హైందవ ధర్మం

పేరు:- రవీంద్రబాబు అరవా
ఊరు:- హైదరాబాద్



95814 19999
## చట్టం సాహితీ లోకం

## అజ్ఞానిని గావుమయ వేంకటేశుడా



శ్రీమన్నారాయణు డాశ్రిత పారిజాతము
పామర పండితుల కీడు పరంధామము

కొండనొక్క వేలనెత్తె కోర్కుల బంగారు కొండ
నిండెడందలో గొల్లలు నిల్పుకున్న ప్రేమకొండ
గుండెలేని కంసునిలో గుబులై రగిలిన కొండ
బండరాయిలో చివురు లిగురొత్తిన వెన్నకొండ

వెలగల వేంకటగిరిని వేల్పువేల్పు వీవంట
వలచిన అలమేల్మంగ పద్మమ్మల ప్రాణమట
తలచిన భక్తాళి కొంగులోని పసిడి వీవంట
కలిమినెలవు బ్రహ్మమయం కామన లీడేర్తువట

అజ్ఞానపు చీకటిలో విజ్ఞానపు దీపానివి
ప్రజ్ఞానపు బ్రహ్మమని పరమాత్మ వీవని
సుజ్ఞానులు సూచింతురు సూక్ష్మాత్మవు నీవని
అజ్ఞానుడ నపరాధిని దయామయ గావుమయ

రచన::శంకర్ జీ డబ్బికార్
ఊరు:: ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

95814 19999
## చట్టం సాహితీ లోకం



## నాన్నో నన్నాపకు :

ఓ నాన్నో నన్నాపకు
తెలంగాణ
తెగ ఏడుస్తున్నది..!
ఓ మిత్రమా నన్నాపకు...
తెలంగాణ తల్లి
తల్లడిల్లుతున్నది...
ఓ మనసా నన్నాపకు
తెలంగాణ తల్లి
నన్ను "కలం"
బ్రూనమంది
నాలో కవిత్వం
పెల్లుబుకుతుంది...!
"ఓ నాన్నో నాన్నపకు "
నా తల్లి తెలంగాణకై
నన్ను
పోరు రాజేయమంది...
నా తల్లి తెలంగాణ
"నన్ను కలం "
పట్టమంది..!
నా జాతి కోసం
జాగారాలు తీస్తున్నా..
నా తల్లీ తెలంగాణ
అభివృద్ధికై
నేనింకా మేల్కొనే వున్నా...
నా తెలంగాణ కోసం
కవిత్వం రాస్తున్న..
నా రాగాలు
నా తెలంగాణ స్వప్నాలు
ఎన్ని "కత్తిపోట్ల" కైనా
నా కలంతో ఎదురీదుతా..
"ఓ నాన్నో నన్నాపకు"
నావి రాజీలేని రచనలు
నా కలం స్వప్నాలు
నా తల్లి తెలంగాణ
ఐశ్వర్యాలు..
కలం నాది!
గళం నాది!
నా కులంతో
పనిలేదు ...
ఈ ప్రపంచమంతా నాదే
ఈ యుగంలో
"నా పుట్టుక"
చరిత్రలో
" నా కలం "
ఎవరు తుడ్వా లేరు...
నా కలం
రచనలు
శాశ్వతం..
నా కలం కళలు
నిరంతర ప్రజ్ఞలు...
ఓ నాన్నో నన్నాపకు...!
నా తల్లీ తెలంగాణ
నన్ను పిలుస్తున్నది.
జైహింద్... జైజై తెలంగాణ!

డా:కందులసుధాకర్
తెలంగాణ కేసరి,
సోషల్ రిఫార్మర్,
సేవ రత్న,
నంది అవార్డు గ్రహీత,
ఖమ్మం జిల్లా,
9390708322.

95814 19999
## చట్టం సాహితీ లోకం



## మన హద్దులు

ఫిర్యాదులు ఎక్కువైతే
నీ విలువ తక్కువవుతుంది
సానుభూతి చూపే ముఖాల వెనుక
నిశ్శబ్ద తీర్పులు పెరుగుతాయి

నీ కథలు చెప్పుకుంటూ ఉంటే
వాళ్ల దృష్టిలో నువ్వు బలహీనుడివే
సమస్యలు హ్యాండిల్ చేయలేని వాడికి
నాయకత్వం ఇవ్వరు... ఇదే నిజం

పని చేసే చోట
పని మాట్లాడాలి
మనసు కాదు, సమస్యలు కాదు
నీ ఫోకస్ మాత్రమే నీ గుర్తింపు

ఇతరుల జీవితాల్లోకి
అనవసరంగా అడుగు పెట్టొద్దు
అది సహాయం కాదు
నీ ఇంప్రెషన్‌కి నష్టం

అడిగితే చేయి అందించు
అడగకపోతే దూరంగా ఉండు
ప్రతి ఒక్కరి పోరాటం
వాళ్లదేనని గుర్తుంచుకో

తప్పు చేశావా?
నిర్భయంగా నిజం చెప్పు.. నిలబడిపో
సాకులు చెప్పే వాడికి
గౌరవం ఎప్పుడూ దక్కదు

"నేను నేర్చుకుంటాను" అన్న మాట
నీకు కొత్త స్థానం ఇస్తుంది
బాధ్యత తీసుకున్న మనిషిని
ప్రపంచం ఎప్పుడూ గౌరవిస్తుంది

గాసిప్స్ ఐతే
ఈ రోజు నవ్విస్తాయి
రేపు నిన్నే ప్రశ్నిస్తాయి
నమ్మకం ఒక్కసారి పోతే
మళ్లీ రాదు

హద్దులు తెలిసిన వాడే
ఎత్తుకు ఎదుగుతాడు
మాటలతో కాదు
నడవడికతోనే గుర్తింపు వస్తుంది

రామడుగు వేణుగోపాల్
దోహా, ఖతార్ (మంథని )



95814 19999
## చట్టం సాహితీ లోకం

## నవయుగ వైతాళికుడు కందుకూరి



తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి
గద్యతిక్కన్న యుగకర్త
కందుకూరి వీరేశలింగం పంతులు/
మొదటి స్వియచరిత్ర రాసిన ధీశాలి
తెలుగులో తొలి ప్రహసనం రాసింది కూడా ఈయనే/
మొట్టమొదటి వితంతువివాహం జరిపించిన సంస్కర్త హృదయం తో
బాల్య వివాహాల రద్దు కోసం ఉద్యమించిన మహోన్నతుడు
గొప్ప సంఘసంస్కర్త/
ఆనాటి సమాజంలోని మూఢనమ్మకాలపై ఉద్యమం చేసిన వైతాళికుడు/
ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తిని గడించి తెలుగు వారి హృదయాల్లో నిలిచాడు/
బాల్య వివాహాల రద్దునుకోరుతూ ఉద్యమిస్తూ వితంతు వివాహాలు జరిపించాలని ఉద్యమ సింహం లాఉద్యమించాడు/
విజ్ఞాన శాస్త్ర గ్రంధాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత కందుకూరి/
సమాజ సేవ కోసం హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి తన యావదాస్తిని దానం ఇచ్చిన దాన శీలి కందుకూరి/
ఇ ర ు వ ది ఐ ద ు స ం వ త్స రా ల ు రాజమహేంద్రవరంలో తెలుగు పండితుడిగాపనిచేసే
మద్రాస్ ప్రెసిడెంట్ కళాశాలలో తెలుగు పండితులుగా ఐదు సంవత్సరాలు పని చేసి విద్యార్థులు హృదయాలలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పేరుపొందారు/
తాను నమ్మిన సిద్ధాంతాన్ని సత్యాన్ని క్రమం తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి యగ కర్త కందుకూరి/
ఆంధ్ర సమాజాన్ని సంస్కరణ బాట పట్టించిన సంస్కర్త కందుకూరి
సమాజంలో మార్పు కోసం కృషి చేసిన తొలినాటి మార్గదర్శకులలో కందుకూరి అగ్రగన్యుడు/
ఆనాటి సమాజంలో అవహేళనకు గురైనా ధైర్యంగా ఎదిరించి నిలిచిన మహోన్నత వ్యక్తి శక్తి కందుకూరి/
ప్రముఖ సంఘసంస్కర్త ఈశ్వరచంద్ర విద్యాసాగర్ స్ఫూర్తితో దక్షిణాదిన కందుకూరి తొలి వితంతు పునర్వివాహం చేయించాడు/
ఆత్మకథ వ్యాసాన్ని తెలుగు సాహిత్యం ప్రవేశపెట్టిన ఘనత ఈయనదే /
ఎన్నో గేయాలు నాటకాలు రచించి స్త్రీల విముక్తి కోసం అధికంగా రచనలు చేసి బాల్యవివాహాలను ఖండించారు/
ఆయన పదునైన విమర్శలు చాలామంది శత్రువులను తెచ్చి పెట్టినా ధైర్యంగా తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి క్షణక్షణంఎదుర్కొన్నారు/
బాలికల మహిళల విద్య కోసం ఎన్నో పాఠశాలలో స్థాపించి నలబై మందికి వితంతువులకు వివాహం జరిపించారు/
కందుకూరి జయంతి ఏప్రిల్ 16న నాటకరంగ దినోత్సవం గా జరుపుకోవడం తెలుగువారి అదృష్టం/
(16...4..2026న నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా రచించిన కవిత)

నడక కవి, అక్షర ప్రవీణ
నల్లా నరసింహమూర్తి
సీనియర్ తెలుగు లెక్చరర్
శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అధ్యాపక సంఘం గౌరవ ఉపాధ్యక్షులు
కురసాల వారి వీధి
అమలాపురం ...533201
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
9247577501



95814 19999
## చట్టం సాహితీ లోకం

## అన్న పోలన్న మాటలు... మురిపించే ముత్యాల మూటలు...!!



1.
నీవు క్లర్క్ వైతే..?
ఫైళ్ళు మోస్తావ్ తిరగేస్తావ్
నీవు కలెక్టర్ వైతే..?
ఆఫైళ్ళ పైనే సంతకాలు చేస్తావ్
ఆ విధి వ్రాతనే తిరగ రాస్తావ్...

2.
నీవు బ్యాంక్ గుమాస్తా వైతే..?
లోన్లకు సిఫార్సు చేస్తావ్...
నీవే బ్యాంక్ మేనేజర్ వైతే
ఎందరికో లోన్లు మంజూరు చేస్తావ్

3.
నీవు కవివైతే..?
కవితలు వ్రాస్తావ్...నీ కలంతో
జీవితాలు మారుస్తావ్ ...నీ జ్ఞానంతో
చితికిన జీవితాలను చిగురింప చేస్తావు
చీకటి జీవితాల్లో వెలుగులు నింపుతావు

4.
కవి పలుకులు వాన చినుకులు
కురిసి కొందర్ని తడిపేస్తాయి..అవి
కొందరిలో విత్తనాలై మొలకెత్తుతాయి

5.
చదువనే గింజ నాటితే...
పండేది పచ్చని పదవుల పంటే...

6.
చదువు దీపాన్ని నీవు వెలిగిస్తే...
నీ ఇల్లు నీ పల్లె మొత్తం వెలుగుమయమే

7.
చదువు అంటే ఉద్యోగం కాదు...
చదువంటే బాధ్యతలకు బంధం బలం.

8.
చిరు ఉద్యోగం గమ్యం కాదు...
పెద్ద బాధ్యతలకది తొలి మెట్టు.

9.
నీ ఎదుగుదల ఒక మెట్టు...
అది నీతోపాటు ఎక్కే జనాలకు లిఫ్ట్...

10.
ఒకరి ఆకలిని తీర్చే
భోజనం పెట్టడం కన్నా
వందమందికి
బ్రతుకుదారిని చూపించడం మిన్న

11.
ఒక మంచి మాట...విత్తనం...
ఒక మంచి పని...ఫలభరిత వృక్షం...

12.
ఒక మామిడి చెట్టు నీ ఇంటికే అందం..
దాని ఫలాలు మీ ఇంటివారే తింటారు
ఒక మామిడి తోట నీ ఊరికే ఆనందం...
కారణం దాని ఫలాలు ఊరంతా తింటారు

13.
నీవు ఎదిగితే  పెరిగేది...నీ పేరు
ఇతరుల్ని ఎదగనిస్తే పెరిగేది...నీ విలువ

14.
నీ కలలు నీవు నిద్రలో చూసేవి కావు...
నీకు నిద్ర పట్టనివ్వనివే నిజమైన కలలు.

15.
నీ కల ఒక పువ్వైతే...అది నిజమైతే
నీవు మేల్కొన్నా అది పరిమళించాలి
నీ జ్ఞానంతో దాన్ని పూలతోటగా మార్చాలి

రచన:
పోలయ్య కవి కూకట్లపల్లి హైదరాబాద్



95814 19999
## చట్టం సాహితీ లోకం



## అపురూపగంధం - హిందూ వివాహ బంధం

1.
మూడుముళ్ళ వివాహ బంధం
మనః కాయాధ్యాత్మిక పథం
నిండు నూరేళ్లు కలిసుండే
పవిత్రమైన దైవ కార్యం

2.
తాళి తీసేయడాకిదేమి
ఆట కాదని, ప్రక్కన బెట్టు
అంగడి వస్తువు కాదనెఱుగు
హిందు దేశపు ధర్మ రూపం

3.
పతీసతుల అనుబంధంబిది
తాళి ముడులవి గుచ్చుతుంటే
కాపురము కల్లోలమైతే
నేటి యోచనతో సరిజేయు

4.
భర్త తప్పులు తెలుసుకుంటే
భార్య నిప్పులు చెరగకుంటే
శాంత భావాల్ పంచుకుంటే
స్వర్గసీమే గృహము తథ్యం

5.
మోసయోచన ముదముగాల్చును
ముక్కుసూటిగ మసలుకుంటే
మనసు ఝరియై పరవశించును
శంకలన్నియు సమసిపోవును
ఉదయ రాగం హృదియె పలుకును

6
ఇతర దేశపు పోకడలతో
మనం ఉనికిని మరచిపోతే
సనాతనమీ ధర్మ మార్గం
వీడినట్లే బంధనాశమె!

రచన:
మహేంద్రాడ
సింహాచలాచార్య
స్కూల్ అసిస్టెంట్ తెలుగు
(టెక్కలి) శ్రీకాకుళం జిల్లా
9703483648
------



95814 19999
చట్టం మీ చట్టం
సాహితీ లోకం

# చట్టం చిత్రం

## దృష్టి



కన్ను చెదిరితే
గురి మాత్రమే తప్పుతుంది
పెన్ను దారి తప్పితే
జ్ఞానం పక్కదారి పడుతుంది
వయసు ముదిరితే
యవ్వనమే ముగిసిపోతుంది
మనసు చెదిరితే మాత్రం
జీవితం గతి తప్పుతుంది
మనిషి దారి తప్పితే
జీవన విధానం మారుతుంది
అందుకే.. మనిషికి జీవితంలో
ముందు చూపు ఉండాలి
ఏదైనా గ్రహించగలిగే
దృష్టి కోణం ఉండాలి
అప్పుడే మన జీవితాలు
ఒడిదుడుకులు లేకుండా
సాఫీగా సాగుతాయి.

మనిషి పరిస్థితులను బట్టి
మారుతూ ఉండడం సహజం
మనిషి బుద్ధి ఎప్పుడూ
ఒకేలా ఉండాలి నేస్తమా!
బురదలో పొర్లే పందిలా
అసలు ఉండకూడదు
జీవితం మొత్తం మీద
కనీసం కొంత మందికైనా
ఉపయోగపడేలాగా బ్రతుకు.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.

95814 19999
చట్టం మీ చట్టం
సాహితీ లోకం

## విరిసిన పువ్వు మెరిసిన నవ్వు



ప్రకృతిలో పువ్వు
వికసిస్తుంది
పరిమళిస్తుంది
ఎవరి మెప్పుకోసమో
పొగడ్తలకోసమో కాదు
ప్రకృతి ధర్మం కోసం

పువ్వు చెట్టు కొమ్మలకు
చివరన ముసి ముసి
నవ్వులు పూయిస్తూ
తుమ్మెదలకు తియ్యని
విందును ఇస్తూ
దేవుని పాదాల చెంత
భక్తిగా ఒదిగి పోతుంది

పువ్వు అమ్మ జడలో
అందమై నవ దంపతుల
మెడలోపెళ్లి దండవై
ప్రేమికుల చేతిలో ప్రేమ
పరిమళమై
పూజకు పుణ్యమై
ప్రేమికులకు భాషయై
మారుతుంది
సొగసులు వెదజల్లుతుంది

కొమ్మపై విరిసిన పువ్వు
గాలిలో సుగందాన్ని
పంచుతుంది
తన పరిమళంతో
పెదవిపై విరిసిన నవ్వు
మనసుతో హాయిని
పంచుకుంటుంది

పువ్వుకు కావాలి మంచు
బిందువుల లాలన
మనుషులకు కావాలి
మమతల నవ్వుల దీవెన

పరిమళించే పువ్వు
తోటకే అలంకారం
వికసించే నవ్వు
జీవితానికే మకరందం

వికసించిన ప్రతి పువ్వు
ఒక ఆశకు సంకేతం
పెదవిపై చిందే ప్రతి నవ్వు
చెదరని సంతోషానికి
సోపానం మనోల్లాసానికి
చైతన్యం

నీ ఆయువు తక్కువే కానీ
వికసించినంత సేపు
స్వచ్ఛతను పంచుతావు
నీ జన్మ క్షణికమే అయిన
నీవు వెదజల్లే పరిమళం
అనంతం
వాడిపోయిన నీ జ్ఞాపకాలు
మిగిలిస్తు జీవితం అంటే
ఇలాగే ఉండాలని నేర్పుతావు

తొలి పొద్దున్నే వెలుగుల్లో
స్నానమాడి వెలుగులు
పూయిస్తూ పూజకో
అలంకారానికో రంగు
రంగుల రేకులతో
ముస్తాబై ఉంటావు

ప్రకృతి కాంతకు
సిగలో అందమై
నిలుస్తావు

తెల్లని మల్లె పువ్వు
నిర్మల మనసుకు గుర్తు
చిరు నవ్వులతో గుడిని
గుబాళింపచేస్తావు

తుమ్మెదలు వాలక ముందే
తీయని తేనె చిందకముందే
శుచిగా నిన్ను కోసి
దైవార్చనకు సిద్ధం చేస్తారు

సుగంధ పరిమళానివి నీవు
భక్తికి ప్రతిరూపం నీవు
అర్చనలోలో ఒదిగిపోయి
జన్మను ధన్యం చేసుకుంటావు
త్యాగంతోనే సార్థకత ఉందని
చాటిచెప్పడమే పువ్వు మతం

నేదునూరి కనకయ్య
ఫ్రీలాన్స్ రచయిత
కాలమిస్ట్
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
కరీంనగర్
9440245771

# రమేశ్‌బాబు తనయుడు తెరంగేట్రం

## జయకృష్ణ హీరోగా శ్రీనివాసమంగాపురం

మంగ లేకపోతే తిరుపతి వదిలివెళ్లే ప్రసక్తే లేదు అంటున్నాడు శ్రీను. ఎంతగానో ప్రేమించిన మంగ తనది కాదు అని తెలిసిన క్షణం శ్రీను ఏ నిర్ణయం తీసుకున్నాడో తెలియాలంటే 'శ్రీనివాస మంగాపురం' చూడాల్సిందే. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరురుడ రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ కథానాయిక. మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. అజయ్ భూపతి దర్శకుడు. అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ సమర్పణలో... చందమామ కథలు పిక్చర్స్ పతాకంపై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ని ప్రముఖ కథానాయకుడు మహేశ్‌బాబు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. 'ఈ క్షణం ఇప్పటికిప్పుడు నీకేమనిపిస్తుంది... నేనస్సలు నీ ఫ్రెండ్ లిస్ట్‌లో ఉన్నానా?' అంటూ కథానాయకుడు అడగ్గా, టాప్ టెన్‌లో ఉంటావులే... అంటూ కథానాయిక ఇచ్చే సమాధానంతో టీజర్ మొదలవుతుంది. శ్రీను,
మంగా అనే యువ జంట చుట్టూ అల్లుకున్న








కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. 'అందమైన జంట, ఆకట్టుకునే ప్రేమకథ, హత్తుకునే భావోద్వేగాలు, అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కుతోన్న చిత్రమిది. తిరుపతి నేపథ్యం సినిమాకి మరింత కొత్తదనాన్ని తీసుకొచ్చింద'ని సినీవర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: జయకృష్ణ, కూర్పు: మాధవ్ కుమార్ గుల్లపాటి, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్.

------------

# సందీప్ కిషన్ ... పవర్‌పేట


'పవర్ పేట'సినిమాపై గురువారం అధికారిక ప్రకటన వెలువడింది. సందీప్ కిషన్ హీరోగా ఈ చిత్రం తెరకెక్కనుంది. సందీప్ యాక్టింగ్ కెరీర్‌కు 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కొత్త సినిమా పోస్టర్‌ను టీమ్ విడుదల చేసింది. చెస్ బోర్డుపై రక్తపు మరకలు, ఎర్ర గులాబీతో డిజైన్ చేసిన పోస్టర్ సినిమాపై ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ప్రేమ, గౌరవం, రాజకీయం ప్రధానాంశాలుగా ఈ సినిమా తెరకెక్కనున్నట్లు అర్థమవుతోంది. కృష్ణచైతన్య దర్శకత్వం వహించే ఈ చిత్రానికి మణిశర్మ మ్యూజిక్ డైరెక్టర్. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. హీరోయిన్, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. ఓ ప్రియా ప్రియా, చిన్నదాన నీకోసం (ఇష్క్), గుండెజారి గల్లంతయ్యిందే తదితర హిట్ పాటలను రాసిన కృష్ణ చైతన్య 'రౌడీ ఫెలో'తో దర్శకుడిగా మారిన సంగతి తెలిసిందే. తర్వాత 'ఛల్ మోహన్ రంగ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' తెరకెక్కించారు. ఎప్పటినుంచో 'పవర్ పేట'పై చర్చ నడుస్తోంది. చైతన్య ముందుగా ఈ సినిమాని నితిన్‌తో తెరకెక్కిస్తున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. కానీ, అది కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో విశ్వక్‌సేన్ పేరు తెర పైకి వచ్చింది. దానిపైనా స్పష్టత రాకపోవడంతో.. సందీప్ కిషన్‌తో చేయనున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఎట్టకేలకు ఇప్పుడు అనౌన్స్‌మెంట్ వచ్చింది.




# కురుప్పులో త్రిషను ఒప్పించా

## దర్శకుడు ఆర్జె బాలాజీ వెల్లడి

నటుడిగా ప్రేక్షకులకు వినోదం పంచిన ఆర్జే బాలాజీ దర్శకుడిగానూ విజయం అందుకున్న సంగతి తెలిసిందే. 'మూకుతి అమ్మన్' (అమ్మోరు తల్లి), 'వీట్ల విశేషం' తర్వాత ఆయన తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' . తెలుగు టైటిల్ 'వీరభద్రుడు' సూర్య హీరోగా నటించిన ఈ సినిమా మే 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న బాలాజీ.. ఈ మూవీ హీరోయిన్, సంగీత దర్శకుడి ఎంపిక గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. నేను గతంలో త్రిషతో ఓ సినిమా చేయాలని అనుకున్నా. కానీ, అది సాధ్యపడలేదు. అందుకే 'కరుప్పు' కోసం సంప్రదించా. స్క్రిప్టు వినగానే ఆమెకు బాగా నచ్చడమే కాక, కథానాయిక పాత్రనూ ఇష్టపడటంతో నటించేందుకు ఆమె అంగీకరించారు. తన క్యారెక్టర్‌కు సంబంధించిన షూటింగ్ పూర్తయినా.. మాతో కలిసి సెట్‌కు వచ్చేవారు. 'ఆరు' తర్వాత 22 ఏళ్లకు మళ్లీ సూర్య- త్రిష కలిసి ఈ మూవీలో నటించారని పేర్కొన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ గురించి మాట్లాడుతూ.. 'మూకుతి అమ్మన్' విడుదలయ్యాక నేను, ఏఆర్ రెహమాన్ మీట్ అయ్యాం. ఆ సమయంలోనే మేం కలిసి వర్క్ చేయాలని అనుకున్నాం. కొన్నాళ్ల విరామం తర్వాత 'కరుప్పు' కోసం ఆయన్ను కలిశా. వ్యక్తిగత కారణాల వల్ల ఈ సినిమాకి పని చేయలేకపోయారు. 'ఈ చిత్రానికి నేను పూర్తిస్థాయిలో వర్క్ చేయగలనని అనుకోవడం లేదు. పైగా సినిమా షూటింగ్ మొదలైంది. ఇప్పుడేం చేద్దాం' అని ఆయన అంటుంటే నాకు బాధ కలిగింది. అప్పటికే ఓ పాట అత్యవసరం కావడంతో.. సాయి అభ్యంకర్‌ను తీసుకున్నా' అని తెలిపారు.




## స్వయంభూ నుంచి రారా ధీవర పాట ప్రోమో విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' పాటకి సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. దీనికి సంబంధించిన ఫుల్ పాటను ఈరోజు సాయంత్రం 6.03 గంటలకు విడుదల చేయబోతున్నట్లు తెలిపింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.



## సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ..ఏక్‌దిన్

స్టార్ బ్యూటీ సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఏక్ దిన్'. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హీరోయిన్ (సాయి పల్లవి) ఇందులో ఒక అరుదైన వ్యాధితో బాధపడుతుంటుంది. అయితే తనను ప్రేమించిన హీరో (జునైద్) అమెతో ఒక్కరోజు అయిన ప్రేమతో గడపాలని కోరుకుంటాడు. అయితే ఆ ఒక్క రోజు వారి జీవితాలను ఎలా మార్చేసింది అనేది కథాంశం. తెలుగులో ఈ చిత్రం ఒక రోజు అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా.. అమీర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రామ్ సంపత్ సంగీతం అందిస్తున్నాడు. సాయి పల్లవి హిందీలో నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి.



# చట్టం స్పోర్ట్స్



# కామెరూన్ గ్రీన్ వరుసగా విఫలమవుతున్నాడు

## గ్రీన్?ను కొనుగోలు చేసి కేకేఆర్ తప్పు చేసింది

## భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్

2026 ఐపీఎల్‌లో భారీ అంచనాలతో అడుగు పెట్టిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ వరుసగా విఫలమవుతున్నాడు. ఇప్పటిదాకా అతడి నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాలేదు. అటు బ్యాటుతోపాటు బంతితోనూ ఫెయిల్ అవుతున్నాడు. దీనిపై భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ స్పందించాడు. గ్రీన్‌ను కొనుగోలు చేసే విషయంలో కేకేఆర్ ఫ్రాంచైజీ తప్పు చేసిందని అభిప్రాయపడ్డాడు. చేసిన తప్పును ఒప్పుకోవడానికి సిగ్గు పడాల్సిన అవసరం లేదని కేకేఆర్‌ను ఉద్దేశిస్తూ అన్నాడు. తాజాగా చిదంబరం స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ కేకేఆర్ ఓడిపోయిన అనంతరం క్రిక్?బజ్?తో మాట్లాడుతూ సెహ్వాగ్ ఈ వ్యాఖ్యలు చేశాడు.ఈ మ్యాచ్?లో సీఎస్కే నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేకేఆర్ 7 వికెట్ల నష్టానికి 160 పరుగులకే పరిమితమై 32 రన్స్ తేడాతో ఓడింది. ఈ మ్యాచ్‌లో గ్రీన్ డకౌట్ అయ్యాడు. ఇప్పటిదాకా ఈ సీజన్?లో ఐదు మ్యాచ్?లు ఆడిన గ్రీన్ చేసింది కేవలం 56 పరుగులే కావడం గమనార్హం. బౌలింగ్?లోనూ ప్రభావం చూపించలేదు. ఒకే వికెట్? తీశాడు. దీంతో కామెరూన్ గ్రీన్‌ని అంత డబ్బు పెట్టి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కాగా, గతేడాది జరిగిన మినీవేలంలో గ్రీన్‌ను కేకేఆర్ రూ.25.20 కోట్లకు కొనుగోలు చేసింది."కేకేఆర్ వద్ద చాలా డబ్బు ఉండడంతో కామెరూన్ గ్రీన్?లాంటి ఆటగాడిపై రూ. 25-27 కోట్లు వెచ్చించింది. కానీ అతడు జట్టుకు భారంగా మారాడు. అతడి మ్యాచ్?లో ఆడిస్తే, పరుగులు చేయడం లేదు. ఒకవేళ అతన్ని జట్టులోకి తీసుకోకపోతే, అంత డబ్బు ఖర్చుపెట్టి బెంచ్‌కే ఎందుకు పరిమితం చేశారని ఫ్యాన్స్ ప్రశ్నిస్తారు. అందుకే గ్రీన్ విషయంలో కేకేఆర్ తప్పు చేసింది. గ్రీన్?ను ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టి కొనుగోలు చేశామని ఒప్పుకోవాలి. అందుకు సిగ్గుపడాల్సిన పనిలేదు. ఇప్పటికైనా అతన్ని జట్టు నుంచి తొలగించి, వేరొకరికి అవకాశం కల్పించండి. అతని బ్యాటింగ్, బౌలింగ్ రెండింటి వల్ల టీమ్?కు ఎలాంటి ఉపయోగం లేదు" అని సెహ్వాగ్ అన్నాడు.గ్రీన్ స్థానంలో టిమ్ సీఫెర్ట్?ను ఎంపిక చేయాలని సెహ్వాగ్ అన్నాడు. "గ్రీన్‌ను బెంచ్‌పై కూర్చోబెట్టి, అతని స్థానంలో టిమ్ సీఫెర్ట్‌ను ఆడించాలని నేను కోరుతున్నా. ఇటీవల, అతను న్యూజిలాండ్ తరఫున ఎలా ఆడాడో ఆందరం చూశాం. ఆ జట్టు ఓపెనర్లు (ఫిన్ అలెన్, సీఫెర్ట్) దూకుడుగా ఆడారు. అందుకే వారిద్దరితోనే (అలెన్, సీఫెర్ట్) ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేయించండి. ఆ తర్వాత అజింక్య రహానెను మూడో స్థానంలో, పావెల్‌ను నాలుగో ప్లేస్‌లో ఆడించండి. రాఘువంశీని మ్యాచ్?లో చివరి స్థానంలో పంపించండి. ఒకవేళ రహానె ఔటైతే, రాఘువంశీని క్రీజులోకి దింపండి. ఇంకెవరైనా ఔటయితే, అప్పుడు పావెల్ లేదా రింకు ఆడించండి" అంటూ కేకేఆర్?కు సెహ్వాగ్? సూచనలు చేశారు. అయితే ఈ సీజన్?లో కేకేఆర్ ఓటమి అంచుల్లో ఉండగా రన్?రేట్ కోసం నెమ్మదిగా ఆడుతోంది. ఈ స్ట్రాటజీపైనా సెహ్వాగ్ మాట్లాడాడు. మ్యాచ్?లో ఓడిపోయినా ఫర్వాలేదని కానీ స్వేచ్ఛగా ఆడండి అంటూ కేకేఆర్ ఆటగాళ్లను ఉద్దేశించి అన్నాడు. "మీరు నిజంగా పాయింట్లు సంపాదిస్తున్నప్పుడు మాత్రమే నెట్? రన్?రేట్ పరిగణనలోకి వస్తుంది. పాయింట్లు లేకుండా, నెట్ రన్‌రేట్ వల్ల ఉపయోగం ఏమిటి ఒకవేళ మీ ఖాతాలో పాయింట్లు ఉండి, ఇతర జట్లతో పోటీ పడుతున్నప్పుడు మాత్రమే నెట్ రన్‌రేట్ ముఖ్యం. అందుకే నెట్? రన్??రేట్?పై దృష్టి పెట్టకుంటా స్వేచ్ఛగా ఆడండి. ఓడిపోయినా ఫర్వాలేదు. కనీసం మీరు ప్రయత్నిస్తే పట్టుదల ఉంటుంది" అని పేర్కొన్నాడు.

# రుతురాజ్ ఉరుకులాట తగ్గించాలి

## రవీచంద్రన్ అశ్విన్ కీలక సలహా



ఐపీఎల్ 2026 సీజన్‌లో పేలవ బ్యాటింగ్‌తో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రవీచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. బ్యాటింగ్‌లో దూకుడు తగ్గించి, క్రీజులో సెట్ అయ్యేందుకు టైమ్ తీసుకోవాలన్నాడు. బంతిని గాల్లోకి లేపకుండా.. సంజూ శాంసన్, ఆయుష్ మాత్రే తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలని సూచించాడు. మరోవైపు వరుస పరాజయాలతో సతమతమవుతున్న కేకేఆర్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు కావాలని అభిప్రాయపడ్డాడు. మంగళవారం చెన్నై వేదికగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 32 పరుగుల భారీ తేడాతో కేకేఆర్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ గురించి జియో హాట్‌స్టార్‌లో మాట్లాడిన అశ్విన్.. సీఎస్‌కే వరుస విజయాలు సాధిస్తున్నా.. రుతురాజ్ గైక్వాడ్ బ్యాటర్‌గా సత్తా చాటాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు.'వరుసగా రెండు విజయాలు కెప్టెన్‌గా రుతురాజ్‌కు పెద్ద ఊరటనిస్తుంది. కానీ అతను బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. అతను తిరిగి ఫామ్ అందుకోవాలంటే బ్యాటింగ్‌లో సాంకేతిక లోపాలను సరిచేసుకోవాలి. టీ20 అంటేనే దూకుడుగా ఆడటం అయినప్పటికీ.. రుతురాజ్ బౌలర్ లైన్ దాటి మరీ ముందుకు వచ్చి త్వరగా వికెట్ పారేసుకుంటున్నాడు. ఆయుష్ మాత్రే, సంజూ శాంసన్ తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలి. ఇన్నింగ్స్ ప్రారంభంలో కాస్త నిదానంగా వ్యవహరించి, బంతిని సరిగ్గా టైమింగ్ చేస్తూ ఎక్కువ సేపు క్రీజులో ఉంటే రుతురాజ్ తన ఫామ్‌ను తిరిగి పొందుతాడు. రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో నేనున్నా ఆందోళన చెందను. కెప్టెన్‌గా సాధించిన విజయాలు అతనిపై ఒత్తిడిని తగ్గిస్తాయి.'అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మరోవైపు వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు రావాలని అశ్విన్ తెలిపాడు. గతంలోనూ కేకేఆర్ ఇలాంటి పరిస్థితుల నుంచి పుంజుకొని విజేతగా నిలిచిందని గుర్తు చేశాడు. 'ప్రస్తుతం కేకేఆర్ జట్టుకు కొత్త శక్తి అవసరం. కేవలం పతిరానా వంటి స్టార్లపైనే ఆధారపడకుండా, డగౌట్‌లో ఉన్న కొత్త ప్రతిభను వెలికితీయాలి. కేకేఆర్ వద్ద తేజస్వి దహియా, ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ సౌరభ్ దూబే వంటి ప్రతిభావంతులు ఉన్నారు. వారికి అవకాశం ఇస్తే జట్టు రూపురేఖలు మారుతాయి. ఐపీఎల్ 2021లో వెంకటేష్ అయ్యర్ జట్టులోకి వచ్చి ఎలాగైతే ఊపు తెచ్చాడో.. ఇప్పుడు కూడా అలాంటి ఒక 'ఎక్స్-ఫాక్టర్' ఆటగాడు కేకేఆర్‌కు అవసరం.'అని అశ్విన్ స్పష్టం చేశాడు.

# పూరన్‌పై ఇర్ఫాన్ కీలక వ్యాఖ్యలు



2026 ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన అతడు ప్రస్తుత సీజన్‌లో ఎలాంటి ప్రభావం చూపించలేకపోతున్నాడు. అతడి వరుస వైఫల్యాల కారణంగా అభిమానులు అసహనంతో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో లఖ్?నవూ, బలమైన ఆర్సీబీని బుధవారం ఢీ కొట్టేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో పూరన్‌పై భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇకనైనా అతడు కమ్?బ్యాక్ ఇవ్వకపోతే జట్టులో అతడి స్థానం ప్రశ్నార్థకం అవుతుందని అన్నాడు. ఈ మేరకు లఖ్?నవూ - ఆర్సీబీ మ్యాచ్?కు ముందు తన యూట్యూబ్ ఛానెల్?లో మాట్లాడాడు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్?లో లఖ్?నవూ ఇప్పటిదాకా నాలుగు మ్యాచ్?లు ఆడింది. అందులో అన్నింట్లోనూ పూరన్ బరిలోకి దిగాడు. కానీ భారీ ఇన్నింగ్స్ ఆడడంలో విఫలమయ్యాడు. నాలుగు మ్యాచ్?ల్లో కేవలం 41 పరుగుల చేశాడు. ఇందులో స్ట్రైక్ రేట్ 85.41గానే ఉండడం గమనార్హం. దీంతో పూరన్ వైఫల్యాలపై ఇర్ఫాన్ మాట్లాడాడు. అతడు అరోగ్యం లేదా మైండ్?సెట్ ఇబ్బందులతో బాధపడుతున్నాడేమో అని అన్నాడు. ఇప్పటికైనా అతడు ట్రాక్?లో పడకపోతే పూరన్ స్థానాన్ని ఆస్ట్రేలియా వికెట్ కీపర్ జోష్ ఇంగ్లిష్ భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపాడు. 'ఈ ఐపీఎల్?లో అతడి స్ట్రైక్ రేట్ 100 కూడా లేదు. అతను అసలు పరుగులు సాధించడం లేదు. అయితే గతేడాది పూరన్ మూడో స్థానంలో బ్యాటింగ్?కు వచ్చాడు. కానీ ఈసారి మిడిలార్డ్?లో దింపుతున్నారు. అతను ప్రస్తుతం ఫామ్‌లో లేడు. ఇందుకు అతడి మానసిక స్థితి సరిగ్గా లేకపోవడం లేదా ఏదైనా అనారోగ్యం సమస్యతో బాధపడుతున్నాడేమో అని అనిపిస్తుంది. ఈ రెండింటిలో ఏదో ఒక సమస్యే పూరన్‌ను ఇబ్బంది పెడుతోంది. దీన్ని వీలైనంత త్వరగా పరిష్కరించుకోకపోతే, పూరన్ ఇబ్బందుల్లో పడే అవకాశం ఉంది. ఎందుకంటే డాషింగ్ క్రికెటర్ జోష్ ఇంగ్లిష్? త్వరలోనే జట్టు శిబిరంలో చేరే అవకాశం ఉంది. ఈ క్రమంలో అతడిపై సహజంగానే ఒత్తిడి ఏర్పడుతుంది' అని ఇర్ఫాన్ వెల్లడించాడు. అలాగే ఆర్సీబీ కెప్టెన్? రజత్ పాటీదార్?పై ప్రశంసలు కురిపించాడు. అతడిపట్ల లఖ్?నవూ స్పిన్నర్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు. స్పిన్నర్లను ఎదుర్కొనేటప్పుడు పాటీదార్ మాన్?స్టార్? అవతారంలోకి మారిపోతున్నాడని అన్నాడు. 'రజత్ పాటీదార్ 200o స్ట్రైక్ రేట్?తో బ్యాటింగ్ చేస్తున్నాడు. ఇక స్పిన్నర్ల బౌలింగ్?లో ఒక్క ఓవర్లోనే మూడు సిక్స్?లు కూడా బాదేస్తున్నాడు. మీరు మిమ్మల్ని మీరు ఒక గ్యాంగ్‌స్టర్‌గా భావిస్తే, స్పిన్నర్ల బౌలింగ్?లో అతడు మాన్?స్టార్?లాగా మారిపోతున్నాడు. పాటీదార్ క్రీజులో నిలబడే అలవోకగా సిక్స్?లు కొడుతున్నాడు. అతడు క్రీజులో నుంచి బయటకు రావడం లేదు. అయితే లఖ్?నవూ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ మాత్రం అతడిని కవ్వించొచ్చు. పాటీదార్ క్రీజు దాటి ఆడేలా కవ్విస్తూ బంతులు వేయాలి. అలా లఖ్?నవూ ఆర్సీబీ కెప్టెన్?కు చెక్ పెట్టొచ్చు' అని ఇర్ఫాన్ వ్యాఖ్యానించాడు.

# రింకూ సింగ్‌పై కృష్ణమాచారి శ్రీకాంత్ విమర్శలు



కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) విధ్వంసకర బ్యాటర్ రింకూ సింగ్‌పై భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ విమర్శలు గుప్పించాడు. రింకూ సింగ్ హిట్టర్ కాదని, గుడ్డిగా ఆడే గాలిగాడని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో కేకేఆర్ వరుస పరాజయాలతో సమతమతమవుతుంది. మంగళవారం చెన్నై వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 32 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన కేకేఆర్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో పాయింట్ల ఖాతా తెరిచింది. ఈ ఐదు మ్యాచ్‌ల్లో రింకూ సింగ్ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. ఈ క్రమంలోనే తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన క్రిష్ శ్రీకాంత్.. రింకూ సింగ్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. గతంలో ఎప్పుడో చివరి ఓవర్లో ఐదు సిక్సర్లు కొట్టాడని హిట్టర్‌గా పిలవడం సరికాదని అభిప్రాయపడ్డాడు.'రింకూ సింగ్ ఏం విధ్వంసకర ఆటగాడు కాదు. ఎప్పుడో పాత రోజుల్లో చివరి ఓవర్లో ఐదు సిక్సర్లు కొట్టాడు. దాంతో జనం ఇప్పటికీ అతన్ని ఆకాశానికెత్తుతున్నారు. అతను కేవలం సింగిల్స్, డబుల్స్ తీయడానికి మాత్రమే పనికొస్తాడు. అదీ లక్ష్యం 170 లోపు ఉన్నప్పుడు మాత్రమే. అతన్ని ఐదో స్థానంలో ఆడించడం సరికాదు.రింకూ సింగ్ ఏ మాత్రం హిట్టర్ కాదు. అతను గుడ్డిగా బ్యాట్ ఊపేస్తున్నాడు. తనకి బౌలింగ్ చేసేవాళ్లంతా 'హల్వా' బౌలర్లు అని అనుకుంటున్నాడా? కేవలం టీ20 ప్రపంచకప్‌లో ఆడినంత మాత్రాన, ఇలా ఇష్టం వచ్చినట్లు బ్యాట్ ఊపేయకూడదు. వచ్చే మ్యాచ్‌లో అతని స్థానంలో కచ్చితంగా టిమ్ సీఫెర్ట్ బరిలోకి దిగుతాడు.'అని శ్రీకాంత్ విమర్శించాడు. కేకేఆర్ బ్యాటింగ్ విభాగంపై కూడా శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'యంగ్ ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ గెలవాలనే ఉద్దేశంతో ఆడటం లేదు. ముఖ్యంగా ఓపెనర్ ఫిన్ అలెన్ నిర్లక్ష్యంగా షాట్లు ఆడుతూ వికెట్ పారేసుకున్నాడు. ఒకే విధమైన బంతికి ప్రతి మ్యాచ్‌లోనూ ఔటవుతున్నాడు.అతని బ్యాటింగ్‌లో మార్పు రాకపోతే.. అలెన్ స్థానంలో సీఫర్ట్‌కు అవకాశం ఇవ్వాలి. కామెరూన్ గ్రీన్ కోసం వెచ్చించిన రూ.25 కోట్లు బూడిదలో పోసిన పన్నీరయ్యింది. అతను అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లోనూ విఫలమవుతున్నాడు. మూడుసార్లు ఐపీఎల్ ఛాంపియన్ అయిన కేకేఆర్ ఇంకా గెలుపు ఖాతా తెరవకపోవడం విడ్డూరం.' అని క్రిష్ శ్రీకాంత్ చెప్పుకొచ్చాడు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999